క్లుప్తంగా

విగ్రహాల ప్రతిష్ఠాపనకు భూమిపూజ



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్‌లు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని రామాలయంలో ఆదివారం గరుత్మంతుడు, ఆంజనేయ స్వామి విగ్రహాల ప్రతిష్ఠాపనకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదివారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు జూపల్లి సత్య నారాయణ, మాధవరం రోజాదేవి రంగా రావు, పండాల సతీష్ గౌడ్, మాజీ కార్పొరేటర్ బాబురావు, ఆలయ చైర్మన్ తులసీరావ్, కూక ట్‌పల్లి శివాలయం మాజీ చైర్మన్ నాయినేని సూర్యారావు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న కళాసిల్క్ చేనేత వస్త్ర ప్రదర్శన



కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

మోతీనగర్: కాలానుగుణంగా వస్త్రాలు ధరించాలని కళాసిల్క్ చేనేత హస్తకళా ప్రదర్శన నిర్వాహకులు వినోద్ జైన్ అన్నారు. మోతీనగర్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన కళాసిల్క్ చేనేత హస్తకళ ప్రదర్శనకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుంది. ఈ మేళాలో దేశంలోని వివిధ రాష్ట్రాల్లో తయారు చేసిన చేనేత, ఖాదీ వస్త్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి రోజు ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు ఈ మేళా అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ఎర్రగడ్డ, బోరబండ, అల్లాపూర్, శ్రీరామ్‌నగర్, రెహ్మత్‌నగర్‌లతో పాటు వివిధ ప్రాంతాల వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అధ్యక్ష, కార్యదర్శుల ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారంలో వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రామ్మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి ఆర్‌కె రాజు పటేల్ తదితరులు

బాలానగర్: బాలానగర్ డివిజన్ పరిధిలోని నవజీవన్‌నగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు ఇటీవల జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా రామ్మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శిగా ఆర్‌కె రాజు పటేల్ ఎన్నికయ్యారు. ఆదివారం ఉగాది పండుగ సందర్భంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలనీ అభివృద్ధికి అందరి సహకారంతో కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ప్రెసిడెంట్ కృష్ణమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ విశ్వనాథన్, కోశాధికారి దయానంద్, వైస్ ప్రెసిడెంట్ సురేష్ సింఘానియా, రవీందర్, సలహాదారుడు సురేందర్‌రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ విద్యార్థుల అరెస్టు అన్యాయం

ఉస్మానియా యూనివర్సిటీ: హెచ్‌సీయూ విద్యార్థులపై పోలీసుల దాడులు, అరెస్టుల అన్యాయమని జార్జిరెడ్డి పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు డా.ఎస్ నాగేశ్వర్ రావు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హెచ్‌సీయూకు చెందిన 400 ఎకరాల భూములను రాష్ట్ర ప్రభుత్వం విక్రయించడాన్ని అడ్డుకుంటున్న విద్యార్థులపై అక్రమ కేసులు పెట్టి అరెస్ట్ చేయడం దారుణమన్నారు. వెంటనే వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

వర్సిటీల భూముల వేలం సిగ్గుచేటు

ఉస్మానియా యూనివర్సిటీ: హెచ్‌సీయూ భూముల వేలాన్ని అడ్డుకున్న ఏబీవీపీ నాయకులు, ఇతర విద్యార్థులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు నగర కార్యదర్శి పృథ్వీతేజ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 60 ఏండ్లుగా ఎంతోమంది విద్యావంతులను అందించిన హెచ్‌సీయూకు చెందిన 400 ఎకరాల భూములను కార్పొరేట్ శక్తులకు విక్రయించాలనుకోవడం తగదన్నారు. కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు కోసం వర్సిటీల భూములు అమ్మడం సిగ్గుచేటు అని మండిపడ్డారు.



కేపీహెచ్‌బీకాలనీ బ్రహ్మంగారి ఆలయం వద్ద పూజలో ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్‌లు సత్యనారాయణ, శ్రీనివాసరావు తదితరులు



నిజాంపేట్‌లోని భాగ్యనగర్ కమ్మ సేవా సంఘాల సమన్వయ సమితి కార్యాలయంలో పంచాంగ శ్రవణంలో ఎమ్మెల్యే గాంధీ

ఉగాది పర్వదినం.. షడ్రుచుల సమ్మేళనం..



వేడుకలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు

- ఆలయాల వద్ద ఉగాది పచ్చడి అందజేత
- పంచాంగ శ్రవణంలో పాల్గొన్న ప్రజలు
- పూజలు నిర్వహించిన ఎమ్మెల్యేలు, భక్తులు



పీఏసీ చైర్మన్ గాంధీని కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న హైదర్‌నగర్ డివిజన్ మహిళలు



వి. రామారావునగర్‌లోని శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



భరత్‌నగర్‌కాలనీ హరిహర క్షేత్రంలోని వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న కార్పొరేటర్ సతీష్ గౌడ్



ఎమ్మెల్యే కృష్ణారావుకు శుభాకాంక్షలు తెలిపిన కార్పొరేటర్ సతీష్ గౌడ్, నాయకులు



బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకలో నియోజకవర్గ ఇన్‌చార్జి కాంతారావు తదితరులు

కూకట్‌పల్లి(జోన్‌బృందం): కూకట్‌పల్లి జంట సర్కిళ్ల పరిధిలో ఆదివారం శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యేలు, కార్పొరేటర్‌లు, ఆయా పార్టీల నాయకులు వేడుకల్లో పాల్గొన్నారు. ఉదయం నుంచే భక్తులు ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఉగాది పచ్చడి స్వీకరించిన అనంతరం పంచాంగ శ్రవణం విన్నారు. షడ్రుచుల సమ్మేళనం సంబరాల సూర్యోదయం భవితల పంచాంగ శ్రవణం, వసంత కోయిల గానంతో వచ్చేదే తెలుగువారి పండుగ ఉగాది అని పలువురు అన్నారు.



వినాయకుడి ఆలయంలో పూజలు చేస్తున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్

ఎస్‌ఎస్‌డీ విద్యార్థికి విఘ్నేశ్వర ఆర్ట్స్ నంది అవార్డు

సుభాష్‌నగర్: షాపూర్‌నగర్‌కు చెందిన ఎస్‌ఎస్‌డీ యోగాశాల విద్యార్థికి ప్రతిష్ఠాత్మక నంది అవార్డు దక్కింది. విఘ్నేశ్వర ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్‌ఎస్‌డీ యోగాశాల విద్యార్థి పూజిత యోగాసనాలను ఎంతో సమతుల్యంగా, స్ప్రింగ్‌లా సునాయసంగా ప్రదర్శించి అందరిని ఆకట్టుకుంది. అత్యుత్తమ ప్రదర్శనతో పూజిత నంది అవార్డును కైవసం చేసుకుంది.



అవార్డు అందుకుంటున్న పూజిత

దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు దోహదం

పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ



కార్యక్రమంలో పాల్గొన్న పీఏసీ చైర్మన్ గాంధీ, కార్పొరేటర్‌లు

ఆల్విన్‌కాలనీ: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు దోహదపడతాయని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ అన్నారు. హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని ఉషా ముళ్లపూడి కమాన్‌వద్ద క్షత్రియ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం కార్పొరేటర్‌లు నార్నే శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉగాది పర్వదినం రోజు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసుకోవడం అభినందించదగ్గ విషయమన్నారు. నగరంలో రోజు రోజుకూ ఎండలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, ప్రజలు నీటికి ఇబ్బంది పడకుండా చలివేంద్రాలు దాహార్తిని తీర్చుతాయన్నారు. అసోసియేషన్ నాయకులు మరింత మంది ముందుకొచ్చి మరిన్ని చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు దేశాల్, క్షత్రియ యూత్ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యేలు

కూకట్‌పల్లి: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఆదివారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ ఆయా నియోజకవర్గ ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ మాసం చాలా పవిత్రమైందని, క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ మాసం అని అన్నారు. రంజాన్ సందర్భంగా నిష్ఠతో పాటించే ఉపవాస దీక్షలు దైవ ప్రార్థనలతో సామరస్యం, శాంతి, సౌభ్రాతృత్వం వెల్లివిరుస్తాయన్నారు.



కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ

రూ.55.01 కోట్ల పన్ను వసూళ్లు

- టార్గెట్‌కు మించి వసూళ్లు

కుత్బుల్లాపూర్: పన్నుల వసూలు చేసే విషయంలో సర్కిల్ అధికారులు రెండు రోజుల ముందుగానే టార్గెట్ పూర్తి చేశారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ.54.36 కోట్లు వసూలు చేయాలని టార్గెట్ పెట్టుకోగా.. ఈనెల 29వ తేదీ నాటికి రూ.55.01 కోట్లు వసూలు కావడం విశేషం. నెల రోజులుగా ప్రతి రోజు టార్గెట్ పెట్టుకొని ముందుకు సాగిన ఉప కమిషనర్ నరసింహ ఎట్టకేలకు టార్గెట్ పూర్తి చేయడంతో పాటు మరో ఐదు కోట్ల రూపాయలు అదనంగా వసూలు చేసేందుకు కృషి చేస్తున్నారు. గతంలో సైతం కుత్బుల్లాపూర్ సర్కిల్ గ్రేటర్ పరిధిలోని ఇంటి పన్ను వసూళ్ల విషయంపై మొదటి స్థానంలో ఉండగా.. తాజాగా గ్రేటర్ పరిధిలో ముందు వరుసలో ఉండే అవకాశం ఉంది. సమిష్టి కృషి వల్లే ఈ వసూళ్లు చేయడం జరిగిందని, ప్రజలు సైతం ముందుకు వచ్చి పన్నులు చెల్లించేందుకు సిద్ధం కావడంతో అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్నామని ఉప కమిషనర్ నరసింహ తెలిపారు.

నేటి అర్ధరాత్రి వరకు ప్రత్యేక కౌంటర్లు

జంట సర్కిళ్ల పరిధిలో సోమవారం రాత్రి 12 గంటల వరకు ఆస్తి పన్ను చెల్లింపు విషయంపై ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు కుత్బుల్లాపూర్, గాజుల రామారం సర్కిల్ ఉప కమిషనర్లు నరసింహ, మల్లారెడ్డిలు తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈద్గాల వద్ద అన్ని ఏర్పాట్లు



మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఆదిత్యనగర్ ఈద్గా వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

- పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ
- మసీదుల వద్ద మౌలిక వసతులు కల్పిస్తున్నాం
- ముస్లింలకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు

చందానగర్: శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ఈద్గాల వద్ద అన్ని ఏర్పాట్లు చేశామని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. ఆదివారం మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఆదిత్యనగర్‌లోని ఈద్గా వద్ద చేపట్టిన పనులను ముస్లింలతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఈద్గాలు, మసీదుల వద్ద అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రార్థనలు చేసుకోవాడానికి ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని అధికారులకు సూచించామని తెలిపారు. ముస్లింలు సంతోషంగా రంజాన్ పండుగ జరుపుకోవాలని అన్నారు. తెలంగాణకు ప్రత్యేకమైన గంగ–జమున–తెహజీబ్ మరింతగా పరిఢవిల్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, సాంబశివరావు, ఖాసీం, అక్కారవు, బృందరావు, సత్యం గుప్తా, సయ్యద్ రిజ్వాన్, కాజా, మియన్ పటేల్, బాబుమియా, ఉమ, రాములు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మసీదులకు నీటి సరఫరాలో అంతరాయం ఉండొద్దు

చందానగర్: ఆదిత్యనగర్‌లో ఉన్న ఈద్గా వద్ద ముస్లింల ప్రార్థనలకు కావాల్సిన ఏర్పాట్లను పూర్తి చేశామని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, మాదాపూర్ కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం ఆదిత్యనగర్‌లోని ఈద్గా వద్ద ఆయన ఏర్పాట్లను పరిశీలించారు. చెత్తాచెదారం ప్రతిరోజు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని పారిశుద్ధ్య సంబంధించిన అధికారులకు తెలియజేశారు. మసీదులకు నీటి సరఫరాలో అంతరాయం ఏర్పరకుండా చూడాలన్నారు. అవసరమైన ప్రాంతాలకు ట్యాంకర్‌ల ద్వారా నీటి సరఫరాకు చర్యలు తీసుకున్నామని అన్నారు. ముస్లింలకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని అధికారులకు తెలియజేశామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివగౌడ్, సాజిద్, నగేష్ నాయక్, మునాఫ్ ఖాన్, రహీం, ముక్తార్, అఖిల్, హనీఫ్, ఇస్మాయిల్, లతీఫ్, సాహెల్, ఇమ్రాన్, హమీద్, రిజ్వాన్ కమిటి సభ్యులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఆదిత్యనగర్ ఈద్గా వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్

ఘనంగా ఇఫ్తార్‌విందు

మోతీనగర్: కూకట్‌పల్లి నియోజకవర్గం గ్రీన్ ల్యాండ్ విద్యుత్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఎస్‌ఎన్‌ఎం భాష ఆధ్వర్యంలో ఇఫ్తార్‌విందును ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఆపరేషన్ గ్రీన్ ల్యాండ్ విద్యుత్ డీఈ భీమా నాయక్ పాల్గొన్నారు. కార్యక్రమంలో వట్టిపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కమ్మరి పటేల్, సనత్‌నగర్ ఏడీఈ వంశీకృష్ణ, గ్రీన్‌ల్యాండ్ సీబీ డీఏడీ చరణ్‌సింగ్, సిబ్బంది ముక్తార్, వెంకటేష్, ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



శిల్పారామంలో పంచాంగ శ్రవణం, కూచిపూడి ప్రదర్శన





పంచాంగ పఠనం చేస్తున్న సాగి కమలాకర శర్మ

మాదాపూర్: ఉగాది పండుగను పురస్కరించుకుని మాదాపూర్‌లోని శిల్పారామంలో ఆదివారం సంపాదకులు, ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్న సాగి కమలాకర శర్మ పంచాంగ పఠనం చేశారు. ఉగాది పండుగ విశిష్టత, కాలానుగుణంగా మారే రుతువులు వాటి ప్రభావాలు, ద్వాదశరాశుల ఆదాయ వ్యయాలు, సంవత్సర ఫలితాలు, పరిహారాలను వివరించారు. శిల్పారామం ప్రత్యేక అధికారి జి.కిషన్‌రావు పంచాంగ కర్తని ఘనంగా సత్కరించారు. అనంతరం అపర్ణధూళిపాళ్ళ శిష్య బృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఇందులో వినాయకస్తుతి, నీలిమేఘ శరీర, బృందావన సారంగి తిల్లాన అంశాలను ప్రదర్శించి అలరించారు. సందర్శకులను ఆకట్టుకున్నారు. కళాకారులు ఆరుషి, శ్రీనిక, యామిని, సురభి, అనన్య, నిత్యశ్రీ, శ్రీకృతి తదితరులు పాల్గొని ప్రదర్శించారు.

చలివేంద్రం ప్రారంభం



కూకట్‌పల్లి: స్వచ్ఛ భారత్ అభియాన్ ఫౌండర్ మాధవరం కాంతారావు ఆధ్వర్యంలో కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయంలో ఆదివారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం వడ్డేపల్లి రాజేశ్వరరావు, సూర్యారావు, శ్రీకరరావు, వినోద్, పద్మాకర్‌లు పాల్గొని మజ్జిగ, మంచినీరు పంపిణీ చేశారు.

ధాన్యం సేకరణకు సన్నద్ధం

- 30 వేల మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యంగా ప్రణాళిక
- ధాన్యం కొనుగోళ్లకు 12 కేంద్రాల ఏర్పాటు

సాక్షి,సిటీబ్యూరో: యాసంగిలో రైతు పండించిన వరి ధాన్యమంతా కొనుగోలు చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఏప్రిల్‌లో ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించేందుకు తగిన చర్యలు తీసుకుంటోంది. జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశాల మేరకు మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు 12 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

పెరిగిన వరి సాగు

మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో యాసంగి సీజన్‌లో సాధారణ వరిపంట సాగు విస్తీర్ణం 10,454 ఎకరాలు కాగా.. రైతులు మాత్రం 11,015 ఎకరాల్లో వరి పంట వేశారు. దీంతో వరి దిగుబడి 33 వేల మెట్రిక్ టన్నులు వస్తుందని జిల్లా వ్యవసాయశాఖ అంచనా వేస్తోంది.

కేంద్రం ప్రకటించిన ధరతోనే కొనుగోలు

రైతులను అన్నీ విధాలుగా ఆదుకోవడంతో పాటు పండించిన వరి ధాన్యానికి కేంద్రం ప్రకటించిన మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ధాన్యం సేకరణలో భాగంగా కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని వసతులు కల్పించారు.



అన్ని రకాల సౌకర్యాలు

టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు, కాంటాలు, తేమ యంత్రాలు, గన్నీ బ్యాగులతో పాటు కొనుగోలు చేసిన ధాన్యాన్ని సకాలంలో గోదాముల్లోకి తరలించేందుకు రవాణా సౌకర్యాన్ని కల్పించారు. ఎండలు మండుతుండటంతో ధాన్యం సేకరణ కేంద్రాల్లో తాగునీటి వసతితో పాటు షామియానాలు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలోని 11 ధాన్యం సేకరణ కేంద్రాల్లో 7.50 లక్షల గన్నీ బ్యాగులు అవసరమని జిల్లా పౌరసరఫరాల శాఖ అంచనా వేసినప్పటికీ, అదనంగా 1.30 లక్షల గన్నీ బ్యాగులను రైతులకు అందుబాటులో ఉంచారు.

ధాన్యం సేకరణ కేంద్రాలివే..

మేడ్చల్ జిల్లాలో 12 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ చేయాలని అధికార యంత్రాంగం నిర్ణయించింది. ప్రతాపసింగారం, ఏదులాబాద్, మాదారం (ఘట్కేసర్ మండలం), కేశవరం, లక్ష్మాపూర్, ఉద్దమర్రి (మూడు చింతలపల్లి మండలం), మేడ్చల్, డబుల్‌పురా, పూడూరు (మేడ్చల్ మండలం), శామీర్‌పేట్, అలియాబాద్, కీసర మండల కేంద్రాల్లో ధాన్యం సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు అధికార యంత్రాంగం పేర్కొంటోంది.

యాసంగి ధాన్యమంతా కొంటాం

రైతులు పండించిన వరి ధాన్యాన్ని 12 కేంద్రాల ద్వారా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో సేకరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ మేరకు సంబంధిత అధికారులు, రైతు ప్రతినిధులు, హమాలీలు, రైస్ మిల్లర్లతో ఇటీవల జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా పండించిన ధాన్యాన్ని నేరుగా కొనుగోలు కేంద్రాలకు తరలించాలి.

– సుగుణబాయి, జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్